క్లుప్తంగా

ఓటర్ల చైతన్యంపై కళాజాత



కళాజాత నిర్వహిస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: మండలంలోని కొమ్ముగూడెం, అంకంపాలెం గ్రామాల్లో శనివారం ఓటర్ల చైతన్యంపై కళాజాత నిర్వహించారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ బాధ్యతగా వినియోగించుకోవాలని కళాకారులు ప్రచారం చేశారు. జిల్లా కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారి ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఎథికల్ ఓటింగ్ జరగాలనే నినాదంతో ఓటర్లను చైతన్యవంతులను చేస్తున్నామని కళాకారులు తెలిపారు.

దర్భగూడెంలో 17 మంది వలంటీర్ల రాజీనామా



రాజీనామా పత్రాలను ఎంపీడీఓ మంగతాయారుకు అందజేస్తున్న వలంటీర్లు

బుట్టాయగూడెం: జీలుగుమిల్లి మండలం దర్భగూడెం సచివాలయ పరిధిలో పనిచేస్తున్న 17 మంది వలంటీర్లు శనివారం మూకుమ్మడి రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను ఎంపీడీఓ మంగతాయారుకు అందజేశారు. ఈ సందర్భంగా వలంటీర్‌లు మాట్లాడుతు 2019 నుంచి 2024 ఏప్రిల్ 2వ తేదీ వరకూ దర్భగూడెం సచివాలయ పరిధిలో ప్రజలకు ఎంతో అంకితభావంతో సేవలందించామని అన్నారు. అయితే ప్రతిపక్షాలు తమపై చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తట్టుకోలేక తామంతా రాజీనామా చేస్తున్నట్లు వలంటీర్‌లు తెలిపారు. కాగా వలంటీర్ రాజీనామా పత్రాలను జిల్లా కలెక్టర్ కార్యాలయానికి పంపిస్తామని ఎంపీడీఓ మంగతాయారు తెలిపారు.

భూవివాదంలో తమకు న్యాయం చేయాలని నిరసన



తహసీల్దార్ కార్యాలయం ఎదుట రోడ్డుపై బైఠాయించిన శ్యామ్‌ను తీసుకువెళ్తున్న పోలీసులు

బుట్టాయగూడెం: మండలంలోని మర్రిగూడెంలో నెలకొన్న భూవివాదంలో తమకు న్యాయం చేయాలంటూ బాషా రంపాలరాజు, బాషా శ్యామ్ కుటుంబ సభ్యులు శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎదురుగా ఉన్న రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. విషయం తెలుసుకున్న ఎస్సై కె.వెంకన్న, పోలీస్ సిబ్బంది వారిని అక్కడి నుంచి పోలీస్ వ్యాన్‌లో ఎక్కించి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అయితే బాషా శ్యామ్‌ను తరలించే క్రమంలో పోలీసులు, శ్యామ్ కుటుంబ సభ్యులకు మధ్య తోపులాట జరగడంతో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా ఎస్సై వెంకన్న మాట్లాడుతూ ఎన్నికల కోడ్, 144 సెక్షన్ అమలులో ఉన్నందున ఎటువంటి ధర్నాలు, రాస్తారోకోలకు అనుమతి లేదన్నారు. ప్రజలకు ఇబ్బంది కలిగే పరిస్థితులు ఉండడం వల్లే అతనిని అదుపులోకి తీసుకున్నామని ఎస్సై చెప్పారు. కాగా మర్రిగూడెం గ్రామంలో కొన్నేళ్లుగా మర్రిగూడెం గ్రామ గిరిజనులకు, రంపాలరాజు కుటుంబ సభ్యులకు భూ వివాదం జరుగుతుంది. ఈ వివాదానికి సంబంధించి పరస్పరం ఒకరికొకరు ఫిర్యాదు చేసుకుంటున్నారు.

రేపు బహిరంగ వేలం

జంగారెడ్డిగూడెం: పశువుల సంత అనంతరం మార్కెట్ యార్డును శుభ్రపరచడం, పేడ ప్రోగు చేసుకుని వెళ్లడానికి ఏడాది కాలానికి గాను బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు చింతలపూడి వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి (ఎఫ్ఏసీ) ఎస్‌కే మహరాజ్ పాషా(బాషా) శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి శుక్రవారం జంగారెడ్డిగూడెం మార్కెట్ యార్డులో పశువుల సంత నిర్వహించడం జరుగుతుందన్నారు. సంత అనంతరం యార్డు శుభ్రపరిచే నిమిత్తం నిర్వహించే బహిరంగ వేలం ఏప్రిల్ 8వ తేదీ ఉదయం 11.30 గంటలకు స్థానిక మార్కెట్ యార్డులో మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆసక్తి గలవారు రూ. 2,500 ధరావతుగా చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు.

ఉపాధి పనులను పరిశీలించిన కమిషనర్

ఏలూరు రూరల్: ఏలూరు రూరల్ మండలం కొల్లేరు గ్రామాల్లో శనివారం రాష్ట్ర రూరల్ డెవలప్‌మెంట్ కమిషనర్ సునీల్ పర్యటించారు. మధ్యాహ్నం 11 గంటలకు పైడిచింతపాడు గ్రామంలో ఉపాధి కూలీలు చేస్తున్న పనులు పరిశీలించి అనంతరం వారితో ఆయన మాట్లాడారు. నెలకు ఎన్నిరోజులు పనిదినాలు చేస్తున్నారు.. వేతనాలు అందుతున్నాయా అని ప్రశ్నించారు. దీనిపై స్పందించిన పలువురు కూలీలు వేతనాలు పెంచాలని కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూలీలకు తాగు నీరు, నీడ కోసం టెంట్లు, ప్రాథమిక చికిత్స తదితర కనీస వసతులు అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. డ్వామా పీడీ ఏ రాము, ఏపీడీ సుధాకర్‌తో పాటు ఏపీఓ కిషోర్, ఇంజినీర్స్, ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు.

రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకే వెయ్యండి



వెంకటాపురంలో రోడ్‌షోలో ప్రజలకు అభివాదం చేస్తున్న కంభం విజయరాజు



జగన్‌కు జై కొడుతున్న మహిళలతో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయరాజు, పార్టీ శ్రేణులు

- వైఎస్సార్ సీపీ చింతలపూడి ఎమ్మెల్యే అభ్యర్థి కంభం విజయరాజు
- వెంకటాపురంలో విస్తృతంగా ఎన్నికల ప్రచారం

చింతలపూడి: నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటానని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కంభం విజయరాజు హామీ ఇచ్చారు. మండలంలోని కాంతంపాలెం, వెంకటాపురం, వెంకటాద్రిగూడెం, గ్రామాల్లో విజయరాజు శనివారం రోడ్ షో జరిపి విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో ఆయన ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ సాగు నీరు, తాగునీటి సమస్యల పరిష్కారానికి శక్తి వంచన లేకుండ కృషి చేస్తానన్నారు. మహిళల ఆర్థిక అభివృద్ధి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమన్నారు. సమాజంలో మహిళలు ఆర్థికంగా, సామాజికంగా ఎదగాలంటే వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావాలన్నారు. టీడీపీ మోసపూరిత వాగ్దానాలను నమ్మవద్దని, ప్రలోభాలకు లొంగకుండా చింతలపూడి ఎమ్మెల్యేగా తనను, ఏలూరు ఎంపీగా కె సునీల్‌కమార్ యాదవ్‌ను గెలిపించాలని అభ్యర్థించారు. రోడ్ షోలో అందర్నీ ఆప్యాయంగా పలకరిస్తూ, చేతులెత్తి నమస్కరిస్తూ ముందుకు సాగారు. సార్వత్రిక ఎన్నికల్లో రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకు వేసి గెలిపించాలని కోరారు.

ఘన స్వాగతం

ఎన్నికల ప్రచారానికి వెంకటాపురం గ్రామం విచ్చేసిన విజయరాజుకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. మాజీ జెడ్పీటీసీ చేపూరి ఖాదర్ బాబు, వెంకటాద్రిగూడెం సర్పంచ్ ఆర్‌పీ రామారావు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పూల వర్షంతో స్వాగతం పలికారు. గ్రామంలో మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. జగన్ జిందాబాద్ జిందాబాద్ అన్న నినాదాలతో వీధులు హోరెత్తాయి. ఆయన వెంట ఏఎంసీ చైర్‌పర్సన్ జగ్గవరపు జానకిరెడ్డి, జెడ్పీటీసీ ఎం నీరజా సుధాకర్, ఎంపీపీ డా బి రాంబాబు నాయక్, వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి గంధం చంటి, పార్టీ పట్టణ కన్వీనర్ కొప్పుల నాగేశ్వరరావు, మాజీ ఏఎంసీ చైర్మన్‌లు బొడ్డు వెంకటేశ్వరరావు, మందలపు సాయిబాబు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ జ్ఞానారెడ్డి, సర్పంచ్‌లు కందుల లక్ష్మీ ప్రసన్న, ఆర్‌పీ రామారావు, రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి కె దినేష్‌రెడ్డి, భరత్‌రెడ్డి, ఎస్ రమేష్‌రెడ్డి, వెంపా కృష్ణ, బి చెంచమరాజు, చేపూరి ఖాదర్‌బాబు, మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు ఎస్ వరలక్ష్మి, జి రాజేష్‌నాయుడు, ఎం ఇమ్మానియేలు, ఎస్ కాంతారావు, టి రాజు, రామరాజు నాయక్, ఎం రాంబాబు, కార్యకర్తలు రోడ్‌షోలో పాల్గొన్నారు.

పారిజాతగిరిలో పూజలు



విశేషాలంకరణలో శ్రీవేంకటేశ్వరస్వామి

జంగారెడ్డిగూడెం: స్థానిక గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుప్రభాతసేవ, ఆరాధన, తోమాలసేవ, తీర్థప్రసాదగోష్ఠి అనంతరం భక్తులకు స్వామి విశేష అలంకరణలో దర్శనమిచ్చారు. ఉదయం నుంచి భక్తులు ప్రత్యేక దర్శనం, అష్టోత్తర పూజలు నిర్వహించి మొక్కుబడులు చెల్లించికున్నారు. అధిక సంఖ్యలో విద్యార్థులు తల్లిదండ్రులు స్వామివారికి 108 ప్రదక్షిణలు చేసి మొక్కుబడులు చెల్లించుకున్నారు. భక్తులకు ఉచిత మజ్జిగ వితరణ రెడ్డిరంగప్రసాద్ చేశారు. అన్నప్రసాద వితరణ ఆలయం తరుపున కార్యనిర్వహణాధికారి మానికల రాంబాబు నిర్వహించారు.

వైభవంగా శ్రీచక్రనవావరణార్చన



జంగారెడ్డిగూడెం నూకాలమ్మ తల్లి

జంగారెడ్డిగూడెం: నూకాలమ్మ తల్లి 60వ వార్షిక ఉగాది జాతర మహోత్సవాల్లో భాగంగా శనివారం రెండోరోజు ఆలయ మండపంలో ముత్తయిదువులచే శ్రీచక్రనవావరణార్చనను ప్రధానార్చకులు యరప్రమిల్లి మనోజ్ శర్మ శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం ఉగాది జాతర ఆంతర్యం, అమ్మలీలా వైభవం గురించి అర్చకులు వివరించారు. భక్తులు విశేష సంఖ్యలో అమ్మవారిని దర్శించి మొక్కులు తీర్చుకున్నారు. పెన్మత్స రాజం రాజు, నాగలక్ష్మీదేవి దంపతులు రూ.10,116, కూచిపూడి రమేష్, రామసీత దంపతులు రూ. 10,116, భోగవల్లి రత్నాజిరావు, బంగారు లక్ష్మి దంపతులు రూ.5,116, అప్పసాని వెంకట రామారావు, నాగలక్ష్మీదేవి దంపతులు రూ.5,116 విరాళాలు సమర్పించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ (పండు) తెలిపారు.

ఎంపీ విజయసాయి రెడ్డిని కలిసిన నేతలు



ఎంపీ విజయసాయి రెడ్డికి భగీరథ భవన్ మొమెంటో అందజేస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: ఎంపీ విజయసాయి రెడ్డిని వైఎస్సార్ సీపీ కొయ్యలగూడెం మండలం సరిపల్లి గ్రామ నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. మందపాటి రామకృష్ణ నేతృత్వంలో పదిహేను మంది నేతలు తాడేపల్లి వెళ్లి ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం వద్ద ఎంపీ విజయసాయి రెడ్డిని కలిసి గ్రామంలోని భగీరథ భవన్ నమూనా మొమెంటోను బహూకరించారు. సరిపల్లి జంక్షన్ రోడ్‌లో ఐదున్నర లక్షల రూపాయలతో మహానేత విగ్రహాన్ని నెలకొల్పామని, పోలవరం ప్రాజెక్టు నమూనాతో నిర్మించిన భవనానికి ఎమ్మెల్యే తెల్లం బాలరాజు సూచన మేరకు భగీరథ భవన్‌గా నామకరణం చేసినట్లు తెలిపారు. మళ్ళీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన అనంతరం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ఈ భగీరథ భవన్‌ను ప్రారంభించడానికి కృషి చేయాల్సిందిగా విజయసాయిరెడ్డిని కోరగా ఆయన సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా భగీరథ భవన్ నమూనా మొమెంటోను ఆయనకు ప్రదానం చేశామన్నారు.

బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహావిష్కరణ



గంగవరం దళితవాడలో బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని ఆవిష్కరించిన దృశ్యం

కొయ్యలగూడెం: భారతరత్న, స్వర్గీయ మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహావిష్కరణ కార్యక్రమం శుక్రవారం రాత్రి గంగవరం గ్రామంలో నిర్వహించారు. ఎంపీటీసీ కొండేపాటి చింతయ్య, దళిత నాయకులు చంద్ర మహేష్ ఆధ్వర్యంలో గ్రామస్తుల విరాళంతో బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. రూ.25 లక్షల వ్యయంతో విగ్రహాన్ని, అదేవిధంగా మండపాన్ని సుమారు రూ.2 లక్షల వ్యయంతో నిర్మించినట్లు తెలిపారు. విగ్రహావిష్కరణలో అఖిలపక్ష రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారన్నారు. అనంతరం పదిహేను వందల మందికి అన్న సమారాధన నిర్వహించారు. కొడారి రాంబాబు, కండెల్లి ఇమ్మానుయేల్, కొడారి ప్రభాకర్, నూతంగి గంగరాజు, ఈడుపుగంటి తాతారావు, ఉండి ఆనందరావు, కొడారి చిన్న, బాల యేసు, ఈడుపుగంటి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీకి ఓటు వేస్తే మళ్లీ కష్టాలే



గొల్లపాడు గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

ద్వారకాతిరుమల: టీడీపీ నాయకుల మాయమాటలు నమ్మి ఆ పార్టీకి ఓటు వేస్తే కష్టాలు కొని తెచ్చుకున్నట్లేనని హోం శాఖా మంత్రి తానేటి వనిత కుటుంబ సభ్యుడు కొండవీటి ఆశీర్వాదం అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం గొల్లపాడు, నారాయణపురం గ్రామాల్లో ఆయన గడపగడపకు వైఎస్సార్ సీపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. సంక్షేమం, అభివృద్ధికి సంబంధించిన కరపత్రాలను ప్రజలకు అందించి వనితకు ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆశీర్వాదం మాట్లాడుతూ టీడీపీ నేతలు చెప్పే కల్లబొల్లి మాటలు నమ్మొద్దన్నారు. ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ పథకాలు మళ్లీ కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంను చేసుకోవాలన్నారు. అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావించి పాలన సాగిస్తుంటే జగన్‌పై కక్ష్య సాధించేందుకు మూడు పార్టీలు ఒకటయ్యాయన్నారు. పేదలను ఆర్థికంగా బలవంతులను చేస్తున్న జగనన్నను వచ్చే ఎన్నికల్లో ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చెలికాని రాజబాబు, పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, జేసీఎస్ కన్వీనర్ భోగరాజు సాయికృష్ణ, పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్, బొండాడ వెంకన్నబాబు, సర్పంచ్ పెద్దిన దిలీప్, దాసరి రాంబాబు, కొండాబత్తుల గిరి, షేక్ మస్తాన్ భాష, బలం వెంకటేశ్వరరావు, జిత్తుక శ్రీను, గొప్పసాని రాధాకృష్ణ, నల్లూరి బాపనయ్య, బోయపాటి మోహనరావు, జంగా వెంకట కృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

అనంతేశ్వరస్వామి, ముత్యాలమ్మకు అభిషేక పూజలు



అనంతేశ్వరస్వామికి అభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని ముత్యాలమ్మ ఆలయం 3వ వార్షిక వేడుకలు శనివారం 3వ రోజు కొనసాగాయి. ఆలయంలో కొలువైన అనంతేశ్వర స్వామితో పాటు ముత్యాలమ్మ అమ్మవారికి అర్చకులు 172 విశేష ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. ఆలయ నిర్మాణకర్త బవిరిశెట్టి మురళీకృష్ణ, పద్మకుమారి దంపతుల ఆధ్వర్యంలో ఆలయంలో మహాన్యాస పూర్వక ఏకవార రుద్రాభిషేకం, ప్రత్యంగిరా అమ్మవారికి అభిషేకం కన్నుల పండుగలా నిర్వహించారు. పూజా కార్యక్రమాలను ఆధ్యాత్మిక సేవా ప్రతినిధి ఈమని శశికుమార్ పర్యవేక్షణలో, ప్రధానార్చకులు మిర్తిపాటి విశ్వనాథ్ శ్రీనివాస్, ఆర్యవైశ్య అర్చకులు బొడ్డు సత్యనారాయణ గుప్తా నిర్వహించారు. కార్యక్రమంలో వాగ్వాల పుల్లారావు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బాల్యం నుంచే మంచి అలవాట్లను నేర్పించాలి



పిల్లలకు ఆరోగ్య సూత్రాలను వివరిస్తున్న మెడికల్ సిబ్బంది

చింతలపూడి: పిల్లలకు బాల్యం నుంచే మంచి అలవాట్లను నేర్పించడంలో తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని యర్రగుంటపల్లి పీహెచ్‌సీ హెడ్ నర్స్ ప్రభావతి సూచించారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా స్థానిక ఎన్‌వీఎన్ కాలనీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో జడ్జి సి మధుబాబు సూచన మేరకు శనివారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ చిన్నారులు మంచి ఆరోగ్యం కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ముఖ్యంగా చిన్నారుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. వేసవి కాలంలో పలుచని దుస్తులు ధరించాలని, ఎండలో బయట తిరగడం ప్రమాద కరమన్నారు. కార్యక్రమంలో న్యాయవాది ఉమర్ ఫరూఖ్, సోషల్ వర్కర్ ఎండీ అక్బర్ ఆలీ, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కృత్రిమ అవయవాల పంపిణీ



దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: ప్రమాదవశాత్తూ కాళ్లు పోగొట్టుకున్న దివ్యాంగులకు విర్డ్ ఆసుపత్రి నందు శనివారం 3డి ప్రింట్‌తో తయారైన కృత్రిమ అవయవాలను ఆసుపత్రి ట్రస్టీ ఐవీఆర్ సుధాకరరావు అందచేశారు. 14 మంది దివ్యాంగులకు కాలిపర్స్., నలుగురికి కృత్రిమ అవయవాలను అందజేశారు. గుప్తా ఫౌండేషన్ సహకారంతో వీటిని పంపిణీ చేశామని తెలిపారు. కార్యక్రమంలో హాస్పిటల్ చైర్మన్ ఎస్‌వీ సుధాకరరావు, ట్రస్టీస్ వి.నారాయణమూర్తి, డాక్టర్ భవ్యాచంద్, డాక్టర్ హమీద్, డాక్టర్ బాలాజీ, డాక్టర్.విహారీ, ఏఓ ఉదయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

హిందీ ఉపాధ్యాయుడికి శిక్షారత్న అవార్డు



డీఈవో అబ్రహం చేతుల మీదుగా శిక్షారత్న అవార్డు అందుకుంటున్న ఉపాధ్యాయుడు నాగరాజు

కామవరపుకోట: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న పోరంకి నాగరాజుకు జాతీయస్థాయిలో నేషనల్ ఇన్‌నోటివ్ శిక్షారత్న అవార్డు శనివారం జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.అబ్రహం అందజేశారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత నాగరాజు మాట్లాడుతూ తాను రూపొందించిన గూగుల్ ఫామ్స్, వర్క్ సీట్స్, క్రియేటివ్ రైటింగ్‌కు గాను జాతీయస్థాయిలో గౌరవం దక్కిందని సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ అవార్డు సెకండరీ సీనియర్, సెకండరీ స్థాయిలలో, విద్యా రంగంలో గణనీయమైన కృషి చేసిన వ్యక్తులకు అందిస్తారని, నాణ్యమైన విద్య కోసం సబ్జెక్టు వర్క్, ఇన్నోవేషన్, ఉపాధ్యాయుల పనితీరు అభ్యాసన, మెరుగుపరిచే కార్యక్రమాలు, వినూత్న ప్రయోగాలు ఆధారంగా మదింపు చేసే నేషనల్ అవార్డ్స్ టు టీచర్ స్కీంలో భాగంగా ఈ అవార్డును ప్రకటిస్తారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగరాజును ఇతర ఉపాధ్యాయులు, బి.ఉమామహేశ్వరరావు, సీహెచ్.సుధాకర్ రెడ్డి, టి.రామారావు, వి.వెంకటేశ్వరరావు, టి.రాజాబాబు, జి.రవీంద్రనాథ్ అభినందించారు.

ఆరోగ్య సంరక్షణపై అవగాహన తప్పనిసరి



ఆరోగ్య సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం సంరక్షణపై అవగాహన కలిగి ఉండాలని బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ విత్తనాల రాజు అన్నారు. జంగారెడ్డిగూడెం డాంగేనగర్ అర్బన్ పీహెచ్‌సీలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం పురస్కరించుకుని న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యమని అన్నారు. పరిసరాలు శుభ్రంగా ఉంచుకుంటూ ప్రతి ఒక్కరూ పోషక ఆహారాలను తీసుకుని వారి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఆయన సూచించారు. ప్రపంచ దేశాలన్ని ప్రజల ఆరోగ్యాన్ని ఒక ప్రాథమిక హక్కుగా గుర్తించాలని డబ్ల్యూహెచ్ఓ సూచించిందని తెలిపారు. అంతేకాకుండా స్వచ్ఛమైన నీరు, గాలి, వాతావరణం, ఆహారం లాంటి మానవ కనీస అవసరాలను ప్రభుత్వం కల్పించాలని, ఈ సంవత్సరం నినాదంలో డబ్ల్యూహెచ్ఓ కోరడమైనదని ఆయన వివరించారు. కార్యక్రమంలో భాగంగా బార్ మెంబర్స్ మేకల రామ్మోహన్‌రావు, తొర్లపాటి శ్రీనివాసరావు, పీహెచ్‌సీ డాక్టర్ పీడీ సల్మాన్ ఖాన్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

సారా బట్టీలపై దాడులు



మెత్తాపుకోట ప్రాంతంలో సారా బట్టీలపై దాడులు నిర్వహిస్తున్న పోలీసులు

పోలవరం రూరల్: నాటుసారా తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని పోలవరం ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్ తెలిపారు. మండలంలోని చేగొండిపల్లి పంచాయతీ పరిధిలోని కొండపై గల అత్యంత మారుమూల మెత్తాపుకోట గ్రామంలో పోలీసులు శనివారం దాడులు నిర్వహించారు. అక్రమంగా సారా తయారు చేస్తున్న బట్టీలపై దాడులు నిర్వహించి 150 లీటర్ల సారాను సీజ్ చేశారు. అలాగే 2వేల లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎస్సై చెప్పారు. సారా తయారు చేస్తున్న ఎం. సోమరాజును పట్టుకోగా, మరో ఇద్దరు నిందితులు పరారయ్యారన్నారు. పట్టుబడ్డ వ్యక్తిని కోర్టుకు పంపగా, రిమాండ్ విధించినట్లు ఎస్సై తెలిపారు.

నాటు సారా విక్రేత అరెస్ట్

టి.నరసాపురం: నాటు సారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్సై డి.దుర్గామహేశ్వరరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వెలగపాడు గ్రామశివార్లలో నాటు సారా తయారు చేసి విక్రయిస్తున్నారనే సమాచారంతో శనివారం తన సిబ్బందితో దాడి చేసినట్లు చెప్పారు. ఈ దాడుల్లో 30 లీటర్ల నాటు సారాను, సారా తయారు చేసే సామగ్రిని స్వాధీనం చేసుకుని, 400 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు చెప్పారు. అలాగే నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం చింతలపూడి కోర్టుకు తరలించినట్లు ఆయన తెలిపారు.

బకాయిలు వెంటనే విడుదల చేయాలి

టి.నరసాపురం: కళాకారులకు ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేసి వారి కుటుంబాలను ఆదుకోవాలని ప్రజానాట్యమండలి ఏలూరు జిల్లా కన్వీనర్ టీవీఎస్ రాజు శనివారం ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుతాన్ని కోరారు. టీడీపీ హయాంలో సంక్షేమ పథకాల ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేసేందుకు కళాకారుల ద్వారా కళా ప్రదర్శనలు నిర్వహించిందన్నారు. అందులో భాగంగానే వందలాది మంది కళాకారులు బుర్రకథలు, వీధి నాటికలు, నృత్య ప్రదర్శనలు, జానపద గేయాలు తదితర కళారూపాలు ప్రదర్శించారన్నారు. అందుకు కళాకారులకు చెల్లించాల్సిన ఆర్థిక పారితోషకం ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి కూడా నేటికీ అందలేదన్నారు. ఉభయగోదావరి జిల్లాలకు చెందిన కళాకారులకు సుమారు రూ.2 కోట్లు రావాల్సి ఉందని ఆయన తెలిపారు. గత ప్రభుత్వ కాలంలో వివిధ పథకాలకు రోడ్లు, వంతెనల నిర్మాణాలకు కాంట్రాక్టర్లకు చెల్లించవలసిన బకాయిలను విడతల వారీగా చెల్లించినట్లుగా కళాకారులకు రావలసిన బకాయిలు చెల్లించాలని అయన డిమాండ్ చేశారు.

సమ్మెటివ్ -2 పరీక్షలు ప్రారంభం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లాలో సమ్మెటివ్ -2 పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయని డీఈవో ఎస్. అబ్రహం తెలిపారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాల్లోని పాఠశాలల్లో 1 నుంచి 9వ తరగతి వరకూ చదువుతున్న విద్యార్థులకు ఈ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరీక్షల్లో నూరు శాతం హాజరు నమోదయ్యేలా చర్యలు తీసుకున్నామని, దీనిపై ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. ఈ పరీక్షలు ఈ నెల 19వ తేదీ వరకూ కొనసాగుతాయని తెలిపారు. శనివారం ఆయన వట్లూరులోని జెడ్పీ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ పాఠశాలల్లో పరీక్షలను పర్యవేక్షించారు.